ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 30.0 | కనిష్ఠం : 22.0

నేడు కాంగ్రెస్ సంక్షేమోత్సవం

» కొల్లాపూర్‌కు రానున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



కొల్లాపూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ నియోజకవర్గ కేంద్రానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, శనివారం కొల్లాపూర్ పట్టణానికి రానున్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు నేతృత్వంలో నియోజకవర్గంలో చేపట్టబోయే అభివృద్ధి సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టనున్నారు. కొల్లాపూర్ పట్టణానికి 11 గంటలకు రానున్న ఆయన రాజా బంగ్లా ముందు ఏర్పాటు చేసిన సభ ప్రాంగణం వద్ద శిలాఫలకాలను మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ డాక్టర్ మల్లురవి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలతో కలిసి ఆవిష్కరించనున్నారు. 4729 మందికి రేషన్ కార్డులు, పలువురికి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందిస్తారు. రైతులకు 9.59 కోట్లు విలువైన విద్యుత్ పరికరాలను మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు అందజేయనున్నారు. అనంతరం సభలో కాంగ్రెస్ చేపడుతున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించనున్నారు. సాయంత్రం సోమశిలలో వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో మంత్రులు సమీక్ష నిర్వహించనున్నారు. రాత్రి కృష్ణానది తీరాన ప్రైవేటు కాలేజీలలో బస చేయనున్నారు. ఉప ముఖ్యమంత్రి కార్యక్రమ ఏర్పాట్లను పోలీసు, రెవెన్యూ విద్యుత్ మునిసిపల్ శాఖ అధికారులతో పాటు కాంగ్రెస్ నాయకులు పర్యవేక్షించారు.

కరిరూపం..! క్లిక్.. క్లిక్..



కొట్టేసి కాల్చిన ఓ చెట్టు మాను గజరూపంలోచూపరులను ఆకట్టుకున్నది. వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం కల్వరాల గ్రామ శివారు ప్రాంతంలో ఒక చెట్టును కొట్టి వేసి కాల్చివేశారు. అటువైపుగా ప్రయాణించే వారికి మాత్రం ఈ వృక్షం మాను ఏనుగు తొండం ఆకృతిలో కనిపిస్తోంది. ఈ దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' తన కెమెరాలో బంధించింది.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వనపర్తి

గడువులోగా పనులు పూర్తి చేయాలి

» దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ

» గద్వాల, జోగుళాంబ రైల్వే స్టేషన్ల పరిశీలన

7



జోగుళాంబ స్టేషన్ బుకింగ్ కౌంటర్ గదిని పరిశీలిస్తున్న సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ

బాల్యానికి 'బంధం' వద్దు

» బాల్య వివాహాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

» ప్రజలకు అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు

7



బాల్య వివాహాలపై పోస్టర్లతో కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు (ఫైల్)

బండ్ల సేఫ్?

బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నట్లు పలుమార్లు స్పష్టం చేసిన గద్వాల ఎమ్మెల్యే

» కాంగ్రెస్ ఫ్లెక్సీల్లో ఫొటోలను అనుమతి లేకుండా వాడటంపై గతంలో ఫిర్యాదు

» ఫిరాయింపుల కేసు నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిపై చర్చ

» ప్రభుత్వ కార్యక్రమాలకు మాత్రమే హాజరు.. పార్టీ కార్యక్రమాలకు దూరం..

» స్పీకర్ నిర్ణయం తీసుకునే సమయంలో అన్ని ఆధారాలను పరిశీలించే అవకాశం



అసెంబ్లీ హాల్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌ను కలిసిన బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి (ఫైల్)



గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



మహబూబ్‌నగర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు కేసులో సుప్రీం కోర్టు గురువారం తీర్పును వెలువరించిన సంగతి తెలిసిందే. పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌కు సూచించింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి పాలమూరు జిల్లాలో పార్టీ మారారని బీఆర్ఎస్ ఆరోపించి కేసు పెట్టిన గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి విషయంలో ఎలాంటి చర్యలు ఉంటాయనే విషయంపై ఆసక్తి నెలకొంది. బయటకు ఎవరూ స్పందించక పోయినా ఏం కాదులే అనే భరోసా కాంగ్రెస్ శ్రేణుల నుంచి.. కచ్చితంగా చర్యలు తీసుకుంటారనే చర్చ బీఆర్ఎస్‌లో చర్చ జరుగుతోంది. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున పోటీ చేశారు. రాష్ట్ర బీఆర్ఎస్ అధికారం కోల్పోయింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక.. పలువురు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌ను వీడి.. కాంగ్రెస్‌లో చేరారు. అందులో బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కూడా ఉన్నారని, ఆయనపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా పలువురు ఎమ్మెల్యేలు సుప్రీం తలుపు తట్టారు. ఆ కేసు విషయంలో సుప్రీం తీర్పు వెలువరించింది. అయితే సంవత్సరం నుంచి బండ్ల ఏ పార్టీలో ఉన్నారనే విషయంలో సందిగ్ధం వీడటం లేదు. కాంగ్రెస్ తమ పార్టీలో ఉన్నారనే సంకేతాలు ఇవ్వగా.. బీఆర్ఎస్ పార్టీ మారారని చెబుతోంది. బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మాత్రం తాను బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నానని పలుమార్లు స్పష్టం చేశారు. ఇప్పటికీ అదే మాట మీద ఉన్నారు. అటు బీఆర్ఎస్ ఇటు కాంగ్రెస్ రెండు పార్టీల కార్యక్రమాలకు ఆయన హాజరు కావడం లేదు. ఏవైనా అధికారిక కార్యక్రమాలు ఉంటే తప్ప.. పార్టీల కార్యక్రమాల్లో మాత్రం కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో స్పీకర్ ఏ నిర్ణయం తీసుకుంటారనే విషయంలో ఉత్కంఠ నెలకొంది.

ఆది నుంచి ఇలా..

అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఇద్దరు ఎమ్మెల్యేలు గెలిచారు. ఇద్దరూ గద్వాల జిల్లా వారే. గత సంవత్సరం జూలై 6వ తేదీన బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి.. మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ డాక్టర్ మల్లు రవి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్‌రెడ్డికి సీఎం కండువా కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. జూలై 30న అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ హాల్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కృష్ణమోహన్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా తాను బీఆర్ఎస్‌లోనే ఉన్నట్లు తెలిపారు. ఆ తర్వాత రెండు రోజులకు మంత్రి జూపల్లి కృష్ణారావు, పలువురు ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఇంటికి వెళ్లి చర్చలు జరిపిన తర్వాత ఆయన కాంగ్రెస్‌లో కొనసాగుతారని చెప్పారు. కానీ బండ్ల మాత్రం ఈ విషయాన్ని ధ్రువీకరించలేదు. అప్పటి నుంచి ఆయన బీఆర్ఎస్‌లో ఉన్నారా? లేదా కాంగ్రెస్‌లో ఉన్నారా? అనే విషయంలో సందిగ్ధం మాత్రం వీడటం

(మిగతా 6లో..)

విద్యార్థుల ఆందోళన

» పెండింగ్‌లో స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా



విద్యార్థులను నిలువరింపజేసేందుకు ప్రయత్నిస్తున్న పోలీసులు

గద్వాల న్యూటౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత కొన్ని సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజ్ రియంబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ముందు విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ గద్వాలశాఖ నగర కార్యదర్శి పద్మశ్రీ మాట్లాడుతూ... విద్యార్థులు స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు ఇబ్బందులు కల్గిస్తున్నారన్నారు. కాబట్టి ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలు చేయాలని, లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పోలీసులు వారిని నిలువరింపేజేసేందుకు యత్నించారు. నగర ఉపాధ్యక్షుడు నరేష్, ఎంఎల్‌డీ కళాశాల అధ్యక్షుడు రఘువంశీ, ఉపాధ్యక్షుడు తేజ, నాయకులు నితిన్, సురేష్, నరేంద్ర, గాయత్రి, ఈశ్వరి, రాజేశ్వరి, అనిత, వైష్ణవి, నిర్మల ఉన్నారు.

విద్యార్థుల పట్ల నిర్లక్ష్యాన్ని వీడాలి

» కలెక్టర్ బీఎం సంతోష్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల న్యూటౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గురుకులాలు, సంక్షేమశాఖల వసతిగృహాల విద్యార్థుల పట్ల నిర్లక్ష్యానికి తావులేదని, ఉండవల్లి జ్యోతిరావు పూలే, బీసీ బాలుర గురుకుల పాఠశాలలో జరిగిన సంఘటన పునరావృతం కాకుండా చూడాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. శుక్రవారం ఐడీవోసీ సమావేశపు హాలులో ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. పాఠశాలలు, హాస్టల్స్ నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం చేసినా తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇటీవలే ఇక పాఠశాలలో జరిగిన ఘటనపై డిప్యూటీ వార్డెన్, సూపర్‌వైజర్‌లను సస్పెండ్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. నిర్లక్ష్యం వహించిన ఇతర అధికారులకు కూడా మెమోలు జారీ చేశామన్నారు. ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ... జిల్లాలో ఎలాంటి సంఘటన జరిగినా పోలీస్‌శాఖ ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని, వసతిగృహాల నిర్వహణపై అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసరావు, ఆర్డీవో అలివేలు, సంబంధిత అధికారులు ఉన్నారు.

బడికి వెళ్లగానే.. 'ముఖం' చూపించాలి

» ఉపాధ్యాయులకు ముఖ గుర్తింపు హాజరు ప్రారంభం

» గద్వాల జిల్లాలో తొలి రోజు 62.4 శాతం నమోదు

» నేడు ప్రధానోపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం

6

నీటి సంపులో పడి మహిళ మృతి

7

డీ-82 కాలువకు నీటి విడుదల

» కాలువను పరిశీలించిన ఇరిగేషన్ ఎస్ఈ

6

వానల్లేవ్..!

» జూన్‌లో 14.3, జూలైలో 13.6శాతం లోటు

» జూలైలో 4రోజులే వర్షం, 6 రోజులు తుంపర

» వాడుముఖం పట్టిన మెట్ట పంటలు

» వర్షాల కోసం రైతుల ఎదురుచూపులు

● జిల్లాలో లోటు వర్షపాతం



వాడుపట్టిన మెట్ట పంటలు

జిల్లాలో ఇప్పటి వరకు 1,73,211 ఎకరాలలో పంటలను సాగు చేశారు. ఇందులో ప్రధానంగా సీడ్ పత్తి 25వేల ఎకరాలలో, కమర్షియల్ పత్తిని 1.09 లక్షల ఎకరాలలో సాగు చేశారు. కందిపంటను 11,561, వేరుశనగ 1,343, మొక్కజొన్న 7,685, పొగాకు 1,300, మిరప 2,938, ఉల్లి 2,191 ఎకరాలలో సాగు చేశారు. ఆముదం, మినుములు, జొన్న తదితర పంటలను తక్కువ విస్తీర్ణంలో సాగు చేశారు. ఇందులో సీడ్‌పత్తి సాగును బోర్లు బావుల కింద సాగు చేయగా మిగిలిన పంటలన్నీ వర్షాధార పంటలే ఉన్నాయి. పది రోజులుగా వర్షాలు లేకపోవడంతో వాడుముఖం పట్టాయి. వర్షం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. దేవుళ్లకు గంగాజలాలలను తీసుకవచ్చి పూజలు చేస్తున్నారు.

గద్వాల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలో లోటు వర్షపాతం నమోదు అయ్యింది. వాతావరణ శాఖ చెప్పినట్లు వర్షాలు సమృద్ధిగానే కురుస్తున్నాయి. కానీ జిల్లాలో మాత్రం ముఖం చాటేశాయి. వారం రోజుల క్రితం బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం వలన రాష్ట్రం అంతటా భారీవర్షాలు పడ్డాయి. పక్కనే ఉన్న మహబూబ్ నగర్, నాగర్‌కర్నూల్‌లో కూడా భారీగానే వర్షాలు కురిశాయి. కానీ జోగుళాంబ



మెట్టపంటగా సాగు చేసిన ఆముదం

గద్వాల జిల్లాలో మాత్రం ఒక సెంటీమీటర్ వర్షపాతం కూడా నమోదు కాలేదు. ముసురుతో వాడుపట్టిన మెట్ట పంటలు ప్రాణం పోసుకున్నాయి.

రెండు నెలలు లోటు వర్షపాతమే..

జిల్లాలో గత జూన్, జూలై నెలల్లో లోటు వర్షపాతం నమోదు అయ్యింది. వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచి జూన్ 12వ తేదీన భారీ వర్షం నమోదు అయ్యింది. దీంతో రైతులు పంటల సాగుకు పూనుకున్నారు. జూన్ 13న అలంపూర్‌లో 20మి.మీ, 23వ తేదీన మల్దకల్‌లో 14.3మి.మీ, 25వ తేదీన రాజోలి, వడ్డేపల్లిలో 11.9మి.మీ. వర్షం కురిసింది. మిగిలిన రోజుల్లో అక్కడక్కడ 10మిల్లీ మీటర్ల కంటే తక్కువే నమోదు అయ్యింది. మొత్తంగా జూన్‌లో 84.4మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా 72.4మి.మీ. కురిసింది. దాదాపు 14.3శాతం లోటు నమోదైంది. ధరూర్, మానవపాడు, ఉండవల్లి, అలంపూర్, ఎర్రవల్లి మండలాల్లో 25శాతం నుంచి 54శాతం వరకు లోటు వర్షపాతం నమోదు అయ్యింది. జూలై నెలలో 112.1.మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా 96.9మి.మీ. కురిసింది. దాదాపు 13.6 శాతం లోటు వర్షం పడింది. జూలై 2వ, 3వ తేదీల్లో జిల్లా అంతటా, 5వ తేదీన 5మండలాల్లో వర్షం కురిసింది. ఆ తర్వాత వర్షం జాడేలేదు. మళ్లీ 18, 20, 21వ తేదీలలో వర్షం కురిసింది. పది రోజులుగా జిల్లా జాడే లేకుండా పోయింది.

ఏడు మండలాల్లోనూ..

జిల్లాలో జూన్‌లో 14.3, జూలైలో 13.6 శాతం లోటు వర్షపాతం నమోదు కాగా, అందులో ఏడు మండలాల్లో మరీ తక్కువగా వర్షపాతం నమోదు అయ్యింది. ఇందులో ధరూర్ మండలంలో జూన్‌లో 28శాతం, జూలైలో 25.9శాతం తక్కువ కురిసింది. మానవపాడులో జూన్‌లో 54 శాతం, జూలైలో 33శాతం, ఎర్రవల్లిలో జూన్‌లో 27శాతం, జూలైలో 34శాతం లోటు కురిసింది. ఉండవల్లిలో జూన్‌లో 39శాతం, అలంపూర్‌లో 25 శాతం తక్కువ కురిసింది. జూలైలో గద్వాలలో 19.8, ఇటిక్యాలలో 29.6శాతం తక్కువ కురిసింది. మిగిలిన మండలాల్లో 10నుంచి 15శాతం లోటు వర్షపాతం నమోదు అయ్యింది. దీంతో రైతులు బోరుబావులు, కాలువలకు మోటార్లు వేసి పంటలను కాపాడుకునేందుకు శ్రమిస్తున్నారు.

సబ్బండ వర్గాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

» రేషన్ కార్డుల పింపిణీలో ఎమ్మెల్యే, కలెక్టర్



లబ్ధిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

పెబ్బేరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సబ్బండ వర్గాల ప్రజల అభివృద్ధే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. మునిసిపాలిటీలో పరిధిలో ఒక ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి లబ్ధిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం దోచుకున్నారు, దాచుకున్నారే తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదని ఆరోపించారు. రాష్ట్రంలో 26లక్షల మంది రైతులకు రూ.21వేల కోట్ల రుణాలు మాఫీ చేయడంతో పాటు రైతు భరోసా, రైతు బోనస్ ఇచ్చి సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతాంగానికి అండగా నిలిచిందన్నారు. చిత్తశుద్ధితో కులగణన చేపట్టి దేశానికే ఆదర్శంగా నిలిచిన ఘనత ప్రజా ప్రభుత్వానికి దక్కిందన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించేందుకు ఆర్డినెన్స్ పాస్ చేసి గవర్నర్‌కు పంపించినట్లు తెలిపారు. గత ప్రభుత్వం ధరణిని అడ్డం పెట్టుకొని రాష్ట్రంలో 18 లక్షల ఎకరాలు భూ కబ్జాలకు పాల్పడ్డారని ఆరోపించారు. జిల్లాల్లో 32,942 మందికి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసినట్లు తెలిపారు. పెబ్బేరు మునిసిపాలిటీ, మండలానికి 545మందికి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశామన్నారు. రేషన్ కార్డుల జారీ అనేది నిరంతర ప్రక్రియ అని, ఎవరికైనా రేషన్ కార్డు రాని వారు సంబంధిత రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ... కొత్తగా రేషన్ కార్డులు పొందిన వారు రేషన్ షాపుల్లో మూడు నెలల బియ్యం తీసుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకటేశ్వర్లు, ఆర్డీవో సుబ్రమణ్యం, జిల్లా సివిల్ సప్లై అధికారి కాశీ విశ్వనాథ్, తహసీల్దార్ మురళి గౌడ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్, వైస్ చైర్మన్ ప్రమోదిని, విజయవర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

బండ్ల సేఫ్?

(5వ పేజీ తరువాయి)

లేదు. తనను కలిసిన చాలామందికి కూడా ఆయన బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నట్లు చెప్పారు. తాను కాంగ్రెస్‌లో చేరలేదని, నియోజకవర్గ అభివృద్ధిపై మాట్లాడటానికి వెళ్తే సీఎం కండువా కప్పారని చెప్పినట్లు సమాచారం. అయితే ఆయన అభిప్రాయం బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నప్పటికీ ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా పలువురు ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయింపుల కేసులో ఆయన పేరును చేర్చడంలో మర్మం తెలియడం లేదు. అనేక ప్రశ్నలు ప్రస్తుతం చర్చలో ఉన్నాయి.

తాను బీఆర్ఎస్‌లోనే ఉన్నట్లు ఫిర్యాదు..

బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కాంగ్రెస్‌లో ఉన్నారా? బీఆర్ఎస్‌లో ఉన్నారా? అనే సంశయం ఉన్న పరిస్థితుల్లో ఈ ఏడాది ఫిబ్రవరి 11వ తేదీన ఆయన పోలీసులకు ఒక ఫిర్యాదు చేశారు. తాను గద్వాల నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ పార్టీ తరఫున గెలిచానని, తాను బీఆర్ఎస్ నుంచే ప్రాతినిధ్యం వహిస్తున్నానని, కానీ కొందరు తన ఫొటోలను అనుమతి లేకుండా కాంగ్రెస్ పార్టీ, ఆ పార్టీ నాయకుల ఫ్లెక్సీల్లో వాడుతున్నారని ఫిర్యాదు పేర్కొన్నారు. ఇలాంటి చర్యల వల్ల ప్రజల్లో గందరగోళ పరిస్థితులు ఏర్పడుతున్నాయని, ఎవరైనా తన ఫొటోలు వాడితే కచ్చితంగా విచారించి చర్యలు తీసుకోవాలని, లేకపోతే తన పరువుకు భంగం కలుగుతుందని కూడా తెలిపారు. ఆ తర్వాత ఆయన బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నట్లు అధికారికంగా పేర్కొనడంతో కొంత గందరగోళం తొలగింది. ప్రస్తుతం పార్టీ ఫిరాయింపుల కేసులో మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీం కోర్టు సూచించడంతో స్పీకర్ ప్రతీ అంశాన్ని పరిశీలించి.. న్యాయ సలహా తీసుకునే అవకాశాలు ఉన్నాయి. అయితే స్వయంగా ఎమ్మెల్యేనే తాను బీఆర్ఎస్‌లో కొనసాగుతున్నట్లు పేర్కొంటుండటంతో ఆయన పదవికి ఎలాంటి ఢోకా ఉండదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

డీ-82 కాలువకు నీటి విడుదల

» కాలువను పరిశీలించిన ఇరిగేషన్ ఎస్ఈ



కాలువను పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

వెల్దండ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపంలో లక్ష్మాపురం వద్ద డీ-82 కేఎల్ఐ కాలువను శుక్రవారం ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. ఇరిగేషన్ ఎస్ఈ సత్యనారాయణరెడ్డి కాలువను పరిశీలించి, స్థానిక రైతులతో మాట్లాడారు. రైతులకు సాగునీరు విడుదల చేసినట్లు తెలిపారు. కాలువలకు ఎవరూ అడ్డంకులు సృష్టించవద్దని, కాలువను తెంపవద్దని సూచించారు. చివరి ఆయకట్టు వరకు సాగుకునీరు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఈఈ శ్రీకాంత్, డీఈఈ దేవన్న, బుచ్చిబాబు, ఏఈలు విశ్వనాథం, ప్రభాకర్, మాల్యా, హెల్పర్ భారతమ్మ ఉన్నారు.

జాతీయ స్థాయికి ఎదగాలి

» జిల్లా కబడ్డీ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్



రాష్ట్రస్థాయి ఎంపికలకు హాజరైన క్రీడాకారులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కబడ్డీలో జిల్లా క్రీడాకారులు జాతీయస్థాయికి ఎదగాలని జిల్లా కబడ్డీ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్ సూచించారు. హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో యువ తెలంగాణ కబడ్డీ చాంపియన్ షిప్‌లో పాల్గొనే జట్ల కోసం ఆదివారం ఎంపికలు నిర్వహించనున్నారు. శుక్రవారం జిల్లా స్టేడియంలో జిల్లా ఎంపికలను చేపట్టారు. ఈ సందర్భంగా కురుమూర్తిగౌడ్ మాట్లాడుతూ ప్రతిభ కనబరిచిన 15 మంది క్రీడాకారులను ఎంపిక చేశామని తెలిపారు. రాష్ట్రస్థాయి ఎంపికల్లో ప్రతిభ కనబరిచే క్రీడాకారులు యువ తెలంగాణ కబడ్డీ చాంపియన్ షిప్‌లో పాల్గొనే జట్లకు ఎంపిక చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ప్రతినిధులు బాల్‌రాజ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులు

మహేష్, హేమంత్, మహిపాల్, అరవింద్, పాండు, కౌశిక్, శ్రీకాంత్, హర్యానాయక్, శివ, శ్రీహరి, వినయ్, చందు, సురేష్, కే. శ్రీకాంత్, రాకేష్‌కుమార్.

టీసీఏ టోర్నీలో పాలమూరు గెలుపు



5 వికెట్లు తీసిన అభిలాష్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలో నిర్వహిస్తున్న సౌత్‌జోన్ అండర్-16 లీగ్ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ జట్టు అచ్చంపేటపై 2 వికెట్ల తేడాతో విజయం సాధించింది. అచ్చంపేట పట్టణంలోని కేటీఆర్ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన మ్యాచ్‌లో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన అచ్చంపేట జట్టు 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 269 పరుగులు చేసింది. అఖిల్ అర్ధసెంచరీతో 63 పరుగులు చేశాడు. మహబూబ్‌నగర్ బౌలర్లలో అభిలాష్ 5 వికెట్లు తీసి రాణించాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన మహబూబ్‌నగర్ జట్టు 46.1 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 270 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులో ప్రణవ్ అర్ధసెంచరీ(83) చేసి రాణించాడు. శంకర్ 39 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. అచ్చంపేట బౌలర్లలో ఫజిల్ 3 వికెట్లు తీశాడు. మహబూబ్‌నగర్ జట్టు విజయం సాధించడంపై సౌత్‌జోన్ ఇన్‌చార్జి జీకే ప్రేమ్‌కుమార్ క్రీడాకారులను అభినందించారు.

జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి

» జిల్లా విద్యాశాఖాధికారి ప్రవీణ్‌కుమార్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల క్రీడల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని జిల్లా విద్యాశాఖాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. 69వ పాఠశాల క్రీడల నిర్వహణపై జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని ఇండోర్‌స్టేడియంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శారదాబాయి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి డీఈవో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌జీఎఫ్ క్యాలెండర్ ప్రకారం ఆగస్టు 20వ తేదీ లోగ మండల స్థాయి, సెప్టెంబర్ మొదటి వారంలో జిల్లా స్థాయి, మూడో వారంలో ఉమ్మడి జిల్లా ఎంపికలు నిర్వహించాలన్నారు. అక్టోబరులో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు ఉంటాయని తెలిపారు. క్రీడాకారుల ఎంపిక పారదర్శకంగా జరగాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో వ్యాయమ ఉపాధ్యాయులు క్రీడలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని చెప్పారు. సమావేశంలో వ్యాయామ ఉపాధ్యాయులు వడెన్న, దూమర్ల నిరంజన్, నిరంజన్‌రావు, రమేష్ బాబు, కృష్ణగౌడ్, రామ్‌కల్యాణ్, రాజవర్ధన్, బాలరాజు, ఉమాదేవి, భానుకిరణ్, సోహెల్, జియావుద్దీన్, శంకర్ పాల్గొన్నారు.

చిన్నారుల మోమున చిరునవ్వులు

- పాలమూరులో ఆపరేషన్ ముస్కాన్ విజయవంతం
- నెల రోజుల్లో 133 మంది బాలబాలికల చేరదీత
- వారిలో 38 మంది ఇతర రాష్ట్రాలకు చెందినవారు
- పిల్లలను పనిలో పెట్టుకున్న 43 మందిపై కేసు





మహబూబ్‌నగర్/ గద్వాల క్రైం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : వెట్టి చాకిరిలో నలిగిపోతున్న చిన్నారుల మోమున చిరునవ్వులు విరబూస్తున్నాయి. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అధికారులు చేపడుతున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. బాల కార్మికులను గుర్తించి, వారిని పాఠశాలలో చేర్పించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం పాలమూరులో విజయవంతం అయ్యింది. జూలై 1 నుంచి 31వ తేదీ వరకు పోలీస్, కార్మిక, విద్య, చైల్డ్‌వెల్ఫేర్ శాఖల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

హోటళ్ళు, ఇటుకల బట్టీలు, కిరాణం దుకాణాలు, మెకానిక్ షాపులు, ఆయిల్ మిల్లులతో పాటు, పొలాల్లో పని చేస్తున్న 133 మంది బాలలను గుర్తించి, విముక్తి కల్పించారు. వారిలో 122 మంది బాలురు, 11 మంది బాలికలున్నారు. వారిలో ఇతర రాష్ట్రాలకు చెందిన వారు 38 మంది ఉండగా, అందులో 34 మంది బాలురు, నలుగురు బాలికలున్నారు. వారిని పనిలో పెట్టుకున్న యజమానులపై 43 కేసులు నమోదు చేశారు. విముక్తి కల్పించిన బాల బాలికలను తల్లి దండ్రులు, బంధువులకు కౌన్సిలింగ్ ఇచ్చి అప్పగించారు.

ఆరు నెలలకోసారి ప్రత్యేక కార్యక్రమం

బాలకార్మికులకు విముక్తి కల్పించేందుకు ప్రతీ 6 నెలలకోసారి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతీ సంవత్సరం జనవరిలో ఆపరేషన్ స్మైల్, జూలైలో ఆపరేషన్ ముస్కాన్ పేరుతో నెల రోజుల పాటు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్రతీ సారి 50 మందిలోపు బాలలను గుర్తిస్తుండగా, గత నెలలో నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్ ద్వారా 133 మందిని వెట్టి నుంచి విముక్తులను చేశారు.

ఆరు నెలల కోసారి కాకుండా నిరంతరం ఇలాంటి తనిఖీలు నిర్వహిస్తేనే బాల కార్మిక వ్యవస్థను నియంత్రించడం సాధ్యమన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఒక సారి విముక్తి కల్పించిన చిన్నారులను మళ్లీ పనిలో పెట్టకుండా తల్లిదండ్రులకు, యజమానులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాల్సి ఉంది.

బాలలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు



బాలలను పనిలో పెట్టుకున్న వారిపై కఠినచర్యలు తీసుకుంటాం. వారిపై కేసులు నమోదు చేస్తాం. తల్లి దండ్రులు కూడా తమ పిల్లలను పనికి పంపించకుండా, పాఠశాలలో చేర్పించాలి. ఉన్నతంగా ఎదగాల్సిన వారి జీవితాలను వెట్టి వైపు మళ్ళించవద్దు. ఎక్కడైనా బాలలను పనిలో పెట్టుకున్నట్లు సమాచారం ఉంటే డయల్ 100, లేదా 8712659360 నెంబర్‌కు కాల్ చేయాలి.

జానకి, ఎస్పీ, మహబూబ్‌నగర్

జోగుళాంబ గద్వాల జిల్లాలో...

జోగుళాంబ గద్వాల జిల్లాలో నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్-11 ద్వారా 75 మంది బాలకార్మికులకు విముక్తి కలిగించినట్లు ఎస్పీ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారిలో బాలలు 66, బాలికలు 9 మంది ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. వెట్టి నుంచి విముక్తి కల్పించి, వారిని తల్లిదండ్రుల వద్దకు చేర్చినట్లు తెలిపారు. వారిలో 8 మంది బాలలను పాఠశాలలో చేర్పించినట్లు పేర్కొన్నారు. వారిని పనిలో పెట్టుకున్న యజమానులపై 18 కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

సోమశిలలో ఆచార్యుల బృందం పర్యటన



సోమశిల కృష్ణానదిలో ఏసీ లాంచీలో ప్రయాణిస్తున్న ఉస్మానియా తెలుగు విభాగం ఆచార్య బృందం , ఉస్మానియా విద్యార్థులు

కొల్లాపూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : పర్యాటక ప్రాంతంగా విరాజిల్లుతున్న సోమశిల గ్రామంలో కృష్ణానది అందాలను, పురాతన ప్రాచీనమైన లలితాంబిక సోమేశ్వర ఆలయాన్ని శుక్రవారం ఉస్మానియా తెలుగు విభాగం ఆచార్య బృందంతో పాటు విద్యార్థులు సందర్శించారు. పాఠ్యాంశాలలో ఉన్న చారిత్రక ప్రదేశాల సందర్శనలో భాగంగా సోమశిల లలితాంబిక సోమేశ్వర ఆలయంతో పాటు శ్రీరంగాపురం ఆలయాన్ని సందర్శించి అక్కడి వారితో ఆ స్థల పురాణాలను, చారిత్రక నేపథ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ సోమశిల కృష్ణానదిలో ఏర్పాటు చేసిన డబుల్ డెక్కర్ ఏసీ లాంచీలో నదిలో విహరించారు. విద్యార్థులు నృత్యాలు, కేరింతల నడుమ నది ప్రయాణం చేసి ప్రకృతి అందాలను వీక్షించారు. ప్రకృతి సంపదకు ఆధ్యాత్మికతకు నిలయమైన సోమశిల భవిష్యత్‌లో గొప్ప స్థాయిలో విరాజిల్లుతుందని ఈ సందర్భంగా ఉస్మానియా తెలుగు విభాగం ఆచార్యులు అభిప్రాయపడ్డారు. ద్వాదశ జ్యోతిర్లింగాల సమూహం ఏకకాలంలో సందర్శించుకునే భాగ్యం, నల్లమల అడవి అందాలు, కృష్ణమ్మ పరవళ్లు వీటన్నింటిని తమ రచనల్లో వివరించే ప్రయత్నం చేస్తామని, ప్రత్యేక పుస్తకం ఈ స్థల పురాణం రాయడానికి ఉపయోగిస్తామని అన్నారు. పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థులు సుమారుగా 54 మంది ఈ పర్యటనలో పాల్గొన్నారు.

పూర్వీకులు ఇచ్చిన గొప్ప సంపద వారసత్వం ఇలాంటివేనని అభిప్రాయపడ్డారు. ఉస్మానియా విశ్వ విద్యాలయం ఆచార్య తాగి కమలాకర శర్మ, తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య రఘు, మహేందర్, చంద్రశేఖర్, దుర్గాప్రసాద్, ఈ ప్రాంతానికి చెందిన పీహెచ్‌డీ విద్యార్థి అంకాలి పరమేష్, ఉస్మానియా విద్యార్థులు పాల్గొన్నారు.

బియ్యం అవకతవకలపై విచారణ

» పెంట్లవెల్లి కేజీబీవీని తనిఖీ చేసిన సివిల్ సప్లై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు



పెంట్లవెల్లి కస్తూర్బా గాంధీ పాఠశాలలో తనిఖీ చేస్తున్న అధికారులు

పెంట్లవెల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం సివిల్ సప్లై ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ హేమ్లానాయక్ తనిఖీ చేశారు. పాఠశాలలో బియ్యం స్టాక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ జిల్లా అధికారుల ఆదేశానుసారం పాఠశాలలో బియ్యం అవక తవకలు జరిగాయన్న అంశంపై విచారణకు వచ్చామన్నారు. పాఠ శాలలో 35 క్వింటాళ్ల బియ్యం పంపిణీ చేస్తే బియ్యానికి స్టాకు రికార్డు సరిగ్గా మెయింటెనెన్స్ చేయలేదని పేర్కొన్నారు. అదే విధంగా బియ్యం స్టాక్‌లో తేడా వచ్చిందని వారన్నారు. అదే విధంగా 8 సంచుల బియ్యానికి పురుగులు పడ్డాయనిపై అధికారులకు తెలియకుండా పందుల మేత కోసం ఎత్తించారని వారన్నారు. ఈ నివేదికను పై అధికారులకు అందజేస్తానని డీటీ పేర్కొన్నారు. కార్యక్ర మంలో పాఠశాల ఎస్‌వో సువర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

బడికి వెళ్లగానే.. ‘ముఖం’ చూపించాలి

» ఉపాధ్యాయులకు ముఖ గుర్తింపు హాజరు ప్రారంభం
» అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు
» గద్వాల జిల్లాలో తొలి రోజు 62.4 శాతం నమోదు
» నేడు ప్రధానోపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం



ఉప్పల ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయుడు



ముఖ గుర్తింపు హాజరులో పులికల్ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉషారాణి

అయిజ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులకు ముఖ గుర్తింపు హాజరును (ఎఫ్ఆర్ఎస్) ప్రభుత్వం తప్పనిసరి చేసింది. పాఠశాల నిర్వహణలో పారదర్శకతను పెంచేందుకు, ఉపాధ్యాయుల గైర్హాజరుకు చెక్ పెట్టేందుకు ఈ నెల 1వ తేదీ నుంచి ఎఫ్ఆర్ఎస్‌ను అమలు చేస్తోంది. అందుకోసం జిల్లా విద్యాశాఖ అధికారులు మార్గదర్శకాలను జారీ చేశారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో మొత్తం 2,125 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నారు. వారంతా యాప్ ద్వారా తమ హాజరును నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ ద్వారా శుక్రవారం తొలి రోజు జిల్లా వ్యాప్తంగా 62.4 శాతం ఉపాధ్యాయులు హాజరు నమోదు చేసుకున్నారు.

ముఖ గుర్తింపు ఇలా...

ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉదయం 9 గంటలకు పాఠశాలకు రాగానే మొదటి ముఖ గుర్తింపు ద్వారా హాజరు వేసుకోవాల్సి ఉంటుంది. సాయంత్రం 4-15 గంటలకు విధులు ముగిసిన తర్వాత మరో మారు ముఖ గుర్తింపు హాజరు వేసుకోవాల్సి ఉంటుంది. అందుకోసం వారు తమ మొబైల్ ఫోన్‌లో డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ (డీఎస్ఈ) పోర్టల్‌లోకి వెళ్లి ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్)లో తమకు కేటాయించిన యూజర్, పాస్‌వర్డ్‌లతో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. దీన్ని జీపీఆర్ఎస్‌తో అనుసంధానం చేయడం వల్ల పాఠశాల ఆవరణలోనే హాజరు వేసుకోవడం సాధ్యం అవుతుంది. ఉపాధ్యాయులు పోర్టల్‌లో గుర్తింపు సంఖ్యతో లాగిన్ అయి ఉదయం, సాయంత్రం ముఖ గుర్తింపు హాజరు నమోదు చేసుకోవాలి. డిప్యూటేషన్‌పై ఇతర పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులు కూడా ఇదే విధంగా హాజరు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. హాజరునమోదు చేసుకోవాల్సి ఉంది. ఎప్పుడైనా సెలవు పెట్టినప్పుడు వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది.

తొలి రోజు 62.4 శాతం హాజరు

ముఖ గుర్తింపు హాజరు ప్రక్రియ శుక్రవారం ప్రారంభం అయినప్పటికి కొందరు అవగాహన లేక నమోదు చేసుకోలేదు. జిల్లా వ్యాప్తంగా 62.4 మాత్రమే హాజరు నమోదైనట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. మొత్తం 2,125 మందిలో దాదాపు 1,200 మంది ముఖ గుర్తింపు హాజరు నమోదు చేసుకున్నట్లు తెలుస్తోంది. కొన్ని చోట్ల సాంకేతిక సమస్యలతో హాజరు వేసుకోలేకపోయారు.

అవగాహన కల్పిస్తాం

ముఖ గుర్తింపుపై అవగాహన లేకపోవడంతో కొందరు ఉపాధ్యాయులు హాజరు నమోదు చేసుకోలేదు.

తొలి రోజు కావడం, కొన్ని చోట్ల సాంకేతిక సమస్యలు తలెత్తడం వల్ల కూడా ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో హాజరు శాతం తక్కువగా నమోద య్యింది. ప్రధానోపాధ్యాయులకు శనివారం వర్చువల్ మీటింగ్ ఏర్పాటు చేసి అవ గాహన కల్పించి, పూర్తి స్థాయిలో హాజరు నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

- అబ్దుల్ హమీద్, జిల్లా విద్యాధికారి

విద్యార్థులతో ఇనుప సామాన్ల మోత

» నాగర్‌కర్నూల్ మైనార్టీ గురుకులంలో దారుణం
» కాసులిస్తేనే పాఠశాలలో అడ్మిషన్
» ఆయాను రూ. 10 వేలు లంచం అడిగిన సిబ్బంది
» సెల్‌ఫోన్‌లో రికార్డింగ్‌తో వైరల్‌గా మారిన ఘటన



పాత సామాన్ కొనుగోలు చేసే బండికి ఇనుప సామగ్రిని చేరవేస్తున్న నాగర్‌కర్నూల్ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు

నాగర్‌కర్నూల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లాలోని గురుకుల పాఠశాలల పరిస్థితి అగమ్యగోచరంగా తయారయ్యింది. వారం రోజుల క్రితం ఉయ్యాలవాడలోని జ్యోతిరావుపూలే బాలికల గురుకుల పాఠశాలలో 111 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. కొల్లాపూర్ నియోజకవర్గంలోని పెంట్లవెల్లిలో గురుకులానికి చెందిన బియ్యం అక్రమ రవాణాకు అవుతున్న విషయం వెలుగు చూసింది. తాజాగా నాగర్‌కర్నూల్ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్‌లో విద్యార్థులతో పాత ఇనుప సామాన్లు మోయించడం వివాదాస్పదంగా మారింది. అంతే కాకుండా రూ. 10 వేల జీతానికే స్వీపర్‌గా పని చేస్తున్న మహిళను రూ. 5 వేలు లంచం డిమాండ్ చేయడం, దీనికి సంబంధించి ఆడియో సోషల్ మీడియాలో వైరల్ కావడం చర్చనీయాంశం అయ్యింది. రెసిడెన్షియల్ స్కూల్‌ల్లో విరిగిపోయిన ఫర్నిచర్‌ను పాత సామాన్ల కొనుగోలుదారులకు అమ్మాలని సిబ్బంది నిర్ణయించుకున్నారు. వాటిని వాహనంలోకి ఎక్కించేందుకు విద్యార్థులను వాడుకున్నారు. చిన్న పిల్లలతో బరువులు మోయించడంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సీట్ల భర్తీలోను చేతివాటం

మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్‌పై రెండు సంవత్సరాల నుంచి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించడం దేవుడెరుగు. వారితో వెట్టిచాకిరీ చేయిస్తున్నారని పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. రెసిడెన్షియల్ స్కూల్లో పని చేస్తున్న కొందరు పైస్థాయిలో మేనేజ్ చేసుకుని విచారణ జరుగకుండా జాగ్రత్త పడుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఇతర వస్తువుల కొనుగోలు విషయంలోనూ అవినీతి వ్యవహారం నడుస్తుండగా, తాజాగా రెసిడెన్షియల్ స్కూల్లో పని చేస్తున్న ఆయా చెప్పినందుకే ఇద్దరు పిల్లలకు సీట్లు ఇచ్చామని, అందుకోసం రూ. 10 వేలు ఇవ్వాలని పాఠశాల సిబ్బందిలో ఒకరు డిమాండ్ చేశారు. అందులో ప్రిన్సిపాల్‌కు రూ. 5 వేలు, తాను రూ. 2500, డీటీ ఆపరేటర్‌కు రూ.2500 ఇస్తానని చెప్పగా, అందుకు ఆమె నిరాకరించింది. మీ రిచ్చే జీతం కంటే ఎక్కువగా పని చేస్తున్నానని బదులిచ్చింది. కావాలంటే రూ. 5 వేలు ఇస్తానని, అందరూ సర్దుకోండని చెప్పింది. ఈ వ్యవహారాన్ని సెల్‌ఫోన్లో రికార్డు చేసిన ఆమె, ఆడియో ఫైల్‌ను మీడియా ప్రతినిధులకు అందించింది. సోషల్ మీడియాలో ఇది వైరల్‌గా మారింది.

తప్పుడు అటెండెన్స్ నమోదు

» ఇద్దరు పంచాయతీ కార్యదర్శులపై చర్యలు
» ఎంపీవోకు షోకాజ్ నోటీసు జారీ

మద్దూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : విధులకు హాజరుకాకుండానే ఫొటోలు అప్‌లోడు చేసి, రోజుల తరబడి విధులకు హాజరు కాని ఇద్దరు పంచాయతీ కార్యదర్శులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహించిన ఎంపీవోకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఈ సంఘటన నారాయణపేట జిల్లా, మద్దూర్ మండలంలో జరిగింది. ఊట్కూర్ మండలంలోని కొత్తపల్లి కార్యదర్శి సురేఖ డిప్యూటేషన్‌పై మద్దూర్ మండలంలోని సీతానాయక్ తండాలో పని చేస్తుండేది. గత నెలలో 15 రోజుల పాటు ఆమె విధులకు హాజరు కాలేదు. కానీ హాజరైనట్లు ఫోటోలు అప్‌లోడ్ చేయడాన్ని ఉన్నతాధికారులు గుర్తించి సస్పెండ్ చేశారు. అలాగే కొత్తపల్లి మండలం, కొత్తపల్లి తండాలో పంచాయతీ కార్యాదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న అంజనేయులు వారం రోజుల పాటు విధులకు హాజరుకాకుండానే ఫోటోలను అప్‌లోడ్ చేశాడు. దీంతో ఉన్నతాధికారులు అతడిని విధుల నుంచి తొలగించారు. వారిపై పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహించిన ఎంపీవో రామన్నకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

యువకుడిపై ఇసుక వ్యాపారుల దాడి



అక్రమంగా ట్రాక్టర్‌లో తరలిస్తున్న ఇసుక



దాడిలో గాయపడ్డ యువకుడు సాయికుమార్

చారకొండ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, చారకొండ మండలంలోని గోకారం వాగు నుంచి కొందరు ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా అడ్డుకున్న యువకుడిపై వారు దాడి చేశారు. శుక్రవారం సాయంత్రం ఈ సంఘటన జరిగింది. గోకారం వాగు నుంచి దాదాపు 10 ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తుండగా గ్రామానికి చెందిన యువకుడు సాయికుమార్‌తో పాటు కొందరు గ్రామస్థులు అడ్డుకున్నారు. దీంతో అక్రమరవాణా దారులు అతడిపై దాడి చేశారు. దీంతో సాయికుమార్ కుడికంటిపై గాయమైంది. సంఘటనపై బాధితుడు చారగొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బాల్యానికి బంధం వద్దు



బాల్య వివాహాల నిర్మూలనపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

- బాల్య వివాహాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు
- ప్రజలకు అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు

వనపర్తి రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : బాల్యానికి మూడు ముళ్ల బంధం వద్దని, బాల్య వివాహం చేసి వారి భవిష్యత్తును నాశనం చేయొద్దని అధికారులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. అయినా వనపర్తి జిల్లాలో అక్కడకక్కడ బాల్య వివాహాలు జరుగుతూనే ఉన్నాయి. వాటిని అరికట్టేందుకు ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నా ఫలితం ఉండటం లేదు. నిరక్షరాస్యత, ఆర్థిక వెనుకబాటు, ఆడపిల్లలపై అభద్రతా భావం, పేదరికం, సామాజిక పరిస్థితులు అందుకు కారణం అవుతున్నాయి.

4 ఏళ్లలో 165 వివాహాల అడ్డగింత

బాల్య వివాహాల నియంత్రణకు మహిళా శిశు సంక్షేమ శాఖ లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పురుషుడి వివాహం వయస్సు 21, స్త్రీల వివాహ వయస్సు 18 ఏళ్లు తప్పనిసరిగా నిర్ణయించింది. ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతున్నట్లు సమాచారం అందగానే జిల్లా బాలల సంరక్షణ శాఖ ఆధ్వర్యంలో అధికారులు అక్కడికి చేరుకొని అడ్డుకుంటున్నారు. వివాహాన్ని నిలిపివేసి, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. బాల్య వివాహం చేసినా, అందుకు ప్రోత్సహించినా చట్టరీత్యా నేరమని చెప్తున్నారు. ఇలా గత 4 ఏళ్లలో వనపర్తి జిల్లా వ్యాప్తంగా 165 వివాహాలను అడ్డుకున్నారు. 2022లో 43, 2023లో 37, 2024లో 55, 2025లో 30 బాల్య వివాహాలను అడ్డుకున్నారు. బాధ్యులపై 50 కేసులు నమోదు చేశారు.

ప్రత్యేక నిఘా ఉంచాం



బాల్య వివాహలపై ప్రత్యేక నిఘా ఉంచి, వాటి నియంత్రణకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నాం. గతంలో పోలిస్తే బాల్య వివాహాల సంఖ్య తగ్గింది. బాల్య వివాహాల నియంత్రణకు గ్రామం, మండల స్థాయి కమిటీలు వేసి పర్యవేక్షిస్తున్నాం. ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే అక్కడికి వెళ్తున్నాం. కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చి వివాహాలు నిలిపి వేయిస్తున్నాం.

- సుధారాణి, జిల్లా సంక్షేమ అధికారి

అవగాహన కార్యక్రమాలు

వనపర్తి జిల్లాల్లో 15 మండలాల పరిధిలో 255 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వాటిలో బాల్య వివాహాలు అధికంగా జరుగుతున్న కొన్ని గ్రామాలను అధికారులు గుర్తించారు. వాటిని ప్రత్యేక హబ్‌లుగా గుర్తించి బాల్య వివాహాలు, వాటి వల్ల కలిగే అనర్థాలపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంతో బాల్యవివాహ రహిత గ్రామాలుగా మార్చేందుకు కృషి చేస్తున్నారు. ప్రతీ నెల పాఠశాలల్లో పరిశీలించి, సుదీర్ఘకాలంగా హాజరుకాని బాలికలను గుర్తించి, జాబితా రూపొందిస్తారు. ఆ జాబితాను అంగన్ వాడీ టీచర్ జిల్లా బాలల సంరక్షణ యూనిట్‌కు పంపిస్తున్నారు. వారు ఆ బాలికల ఇళ్లకు వెళ్లి విచారణ నిర్వహిస్తున్నారు. బాల్య వివాహాల వల్ల ఎదురయ్యే అనర్థాలు, చదువు ప్రాధాన్యంపై వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు.
బాలికలను పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. జిల్లాలోని పాన్‌గల్, వనపర్తి, ఘనపూర్, కొత్తకోట మండలాల్లో బాల్య వివాహాలను అడ్డుకొని, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

ప్రతీ మంగళ, బుధ వారాల్లో గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా బాలల పరిరక్షణ అధికారి రాంబాబు తెలిపారు.

క్రైం కార్నర్

సంపులో పడి మహిళ మృతి



బాలమణెమ్మ (ఫైల్)

ఊర్కొండ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు సంపులో పడి ఓ మహిళ మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం రాచాలపల్లి గ్రామంలో చోటుచేసుకున్నది. స్థానికులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బాలమణెమ్మ (58) గురువారం రాత్రి ఇంట్లో నిద్రించింది. మధ్య రాత్రి ఇంటి నుంచి బయటికి వెళుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు నీటి సంపులో పడింది. శుక్రవారం తెల్లవారుజామున ఆమె ఇంట్లో కనిపించకపోవడంతో ఇరుగుపొరుగు వారితో కుటుంబ సభ్యులు ఆరా తీయగా ఆచూకీ లభించలేదు. దీంతో నీటి సంపులో చూడగా ఆమె అందులో మృతి చెంది కనిపించింది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి , పలువురికి గాయాలు



సాయమ్మ (ఫైల్)

పాన్‌గల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి, నాగర్‌కర్నూల్, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. పలువురు గాయపడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వనపర్తి జిల్లా, పాన్‌గల్ మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన గడ్డం సాయమ్మ (70) శుక్రవారం పెన్షన్ తీసుకునేందుకు బయలుదేరింది. అదే సమయంలో దొండాయిపల్లి వైపు నుంచి వెళ్తున్న బొలెరో వాహనానికి ఎదురుగా స్కూల్ బస్సు వచ్చింది. దీంతో ఆ వాహనం రివర్స్ తీసుకుంటుండగా, నడుచుకుంటూ వెళ్తున్న సాయమ్మను ఢీకొన్నది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె కుమారుడు గడ్డం స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

బైక్ ఢీకొని మరొకరు..



మల్లయ్య (ఫైల్)

వెల్దండ (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, వెల్దండ మండల పరిధిలోని రాఘాయిపల్లి గేట్ సమీపంలో గురువారం రాత్రి ద్విచక్రవాహనం ఢీకొని నలుగురు గాయపడ్డారు. వారిలో ఒకరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. రాఘాయిపల్లి గ్రామానికి చెందిన శవ్వ మల్లయ్య (43), పెంటయ్య, అంజయ్య, శవ్వ మల్లేశ్‌లు గ్రామంలోని ఓ వివాహానికి హాజరయ్యారు. ఆచారంలో భాగంగా పుట్టమన్ను తెచ్చేందుకు రోడ్డు పైకి వచ్చారు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి కల్వకుర్తి వైపు వస్తున్న ద్విచక్ర వాహనం వారిని ఢీకొన్నది. ప్రమాదంలో బైక్ నడుపుతున్న నల్గొండ జిల్లా నేరెడుకొమ్మకు చెందిన మానుపాటి ప్రశాంత్‌తో పాటు, శవ్వ మల్లయ్య, అంజయ్య, మల్లేశ్ గాయపడ్డారు. వారిని స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వారిలో మల్లయ్య పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరా బాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందాడు. అతడికి భార్య పద్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కురుమూర్తి తెలిపారు.

కారు, ద్విచక్ర వాహనం ఢీకొని..



రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న కారు

అలంపూరుచౌరస్తా (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, ఉండవల్లి మండల పరిధిలోని బొంకూరు శివారులో అంతర్రాష్ట్ర రహదారిపై శుక్రవారం కారు, ద్విచక్రవాహనం ఢీకొని ఆరుగురు గాయపడ్డారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన సూర్యనారాయణరావు, నాగమణి, పద్మనాభసుబ్రహ్మణ్యం, దుర్గభవాని దంపతులు మరో బాలుడితో కలిసి తిరుపతికి బయలుదేరారు. జోగుళాంబ గద్వాల జిల్లా, బొంకూరు శివారులో వీరు ప్రయాణిస్తున్న కారును ఎదురుగా వస్తున్న ఓ బైక్‌ను ఢీకొని, పక్కనే ఉన్న గార్డ్‌స్టోన్‌ను ఢీకొన్నది. ప్రమాదంలో కారు కూడా అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. బైక్‌పై వస్తున్న బొంకూరు గ్రామానికి చెందిన వెంకటన్న, రామేశ్వరమ్మలకు, కారులో ఉన్న నలుగురికి గాయాలయ్యాయి. వారిని అంబులెన్స్‌లో కర్నూలు ఆసుపత్రికి తరలించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని...

తెలకపల్లి (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన యువకులు శివ, ప్రశాంత్‌లు ద్విచక్రవాహనంపై ఇంటి నుంచి షాప్ దగ్గరికి వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొన్నది. దీంతో శివకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లగా, వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మల్దకల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : జోగు ళాంబ గద్వాల జిల్లా, మల్దకల్ మండల పరిధిలోని తాటికుంట రిజర్వాయర్ నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ నందీకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెంచికలపాడు గ్రామానికి చెందిన ట్రాక్టర్ తాటికుంట రిజర్వాయర్ నుంచి ఇసుకను అక్రమంగా మద్దెల బండ మీదుగా మల్దకల్‌కు తరలిస్తుండగా పోలీసులు లక్షణ్, నవీన్ తనిఖీ చేశారు. అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నందీకర్ తెలిపారు.

గంగాభవానీ ఆలయంలో చోరీ



చోరీ జరిగిన ఆలయం

చిన్నచింతకుంట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, చిన్నచింతకుంట మండల కేంద్రంలోని గంగాభవానీ ఆలయంలో గురువారం సాయంత్రం చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గుర్తు తెలియని వ్యక్తులు తాళం విరగ్గొట్టి గర్భ గుడిలోకి ప్రవేశించారు. అమ్మవారి బంగారు ఆభరణాలు ముక్కెర, పుస్తెల గొలుసులు, వెండి ఆభరణాలు అమ్మ వారి ముఖం, ముక్కెర, కిరీటం, వడ్డాణం, గొలుసులను ఎత్తుకెళ్లారు. మొత్తంగా రూ. 80 వేల విలువైన బంగారం, రూ. 1.20 లక్షల విలువైన వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ఈ సంఘటనపై ఆలయాన్ని శుభ్రం చేసే కల్పన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామ్‌లాల్ నాయక్ తెలిపారు.

యువకుడి అదృశ్యం

రాజాపూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలంలోని అగ్రహారం పొట్లపల్లికి చెందిన నవీన్ అదృశ్యం అయ్యాడు. మంగళవారం ఇంటి నుంచి బయటికి వెళ్లిన అతడు తిరిగి రాలేదు. ఫోన్ కూడా కలవకపోవడంతో కుటుంబసభ్యులు స్నేహితులు, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. సంఘటనపై అతడి భార్య ప్రవళిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ధన్వాడ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, పీడీ సస్పెన్షన్

ధన్వాడ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, ధన్వాడ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఉమ్మె ఆస్రా, పీడీ తులసీదాస్‌లను విద్యాశాఖ అధికారులు సస్పెండ్ చేశారు. పాఠశాల వసతి గృహంలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గత వారం విద్యార్థినులు ఆందోళన చేపట్టారు. జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు, ఎంఈవో గాయత్రి సమస్యలను పరిష్కారిస్తామని చెప్పినప్పటికీ దాదాపు గంట పాటు వర్షంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ నేపథ్యంలో క్రమశిక్షణ చర్యల కింద ప్రిన్సిపాల్, పీడీలను సస్పెండ్ చేస్తూ విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా కృష్ణమూర్తిని నియమించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు శిక్ష

తాడూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఓ వ్యక్తికి జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు ఇచ్చారు. మరో ముగ్గురిని కోర్టు ఆవరణను శుభ్రం చేయాలని ఆదేశించారు. ఎస్‌ఐ గురుస్వామి తెలిపిన వివరాల ప్రకారం... నాగర్‌కర్నూల్ జిల్లా, తాడూరు మండల కేంద్ర సమీపంలో కల్వకుర్తి, నంద్యాల జాతీయ రహదారిపై గురువారం పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గుట్టలపల్లి గ్రామానికి చెందిన భగవంతు, శ్రీశైలం, దినేష్‌కుమార్, భాస్కర్‌లు మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడటంతో పోలీసులు వారిని శుక్రవారం జిల్లా కోర్టులో హాజరు పరిచారు. వారిలో భగవంతుకు రెండు రోజుల జైలు శిక్ష, రూ. 300 జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు వెల్లడించారు. శ్రీశైలం, దినేష్‌కుమార్, భాస్కర్‌లకు ఉదయం నుంచి సాయంత్రం వరకు కోర్టు ఆవరణను శుభ్రం చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో పాటు వారికి కూడా రూ. 300 చొప్పున జరిమానా విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గడువులోగా పనులు పూర్తి చేయాలి

- దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ
- గద్వాల, జోగుళాంబ రైల్వే స్టేషన్ల పరిశీలన



గద్వాల రైల్వేస్టేషన్ వద్ద పనులను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ

గద్వాల అర్బన్/ అలంపూర్ చౌరస్తా, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : అమృత్ రైల్వే పథకంలో భాగంగా గద్వాల జంక్షన్ వద్ద చేపట్టిన అభివృద్ధి పనులను గడువులోగా పూర్తి చేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ అధికారులను ఆదేశించారు. జోగుళాంబ గద్వాల జిల్లా లోని గద్వాల, అలంపూర్ జోగుళాంబ రైల్వే స్టేషన్లలో చేపట్టిన పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ 2026 జూన్‌లోగా అన్ని స్టేషన్లలో అభివృద్ధి పనులను పూర్తిచేసి ప్రయాణీకులకు అందుబాటులోకి తెస్తామని చెప్పారు. మహబూబ్‌నగర్ - గుత్తి డబ్లింగ్ పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. అలంపూర్ సమీపంలో నిర్మాణంలో ఉన్న కోచ్‌ల తయారీ యూనిట్‌ను త్వరలోనే అందుబాటులోకి తెస్తామని చెప్పారు. కాచిగూడ - రాయచూర్ డెమో రైలును మంత్రాలయం వరకు పొడగించాలన్న విజ్ఞప్తిని సంబంధింత విభాగం ఆధ్వర్యంలో పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గద్వాల జంక్షన్ రైల్వేస్టేషన్ వద్ద నిర్మిస్తున్న ఆర్చి నిర్మాణ నమూనా, నాలుగు లేన్ల రోడ్డు పనులు, ముఖ ద్వారం, పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. స్థానిక అధికారులతో మాట్లాడి పనుల పురోగతిని తెలుసుకున్నారు. అంతకుముందు ఆయనకు స్టేషన్‌మాస్టర్ విజయ్‌శేఖర్ ఝా, అధికారులు, సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం అలంపూర్‌లోని జోగుళాంబ రైల్వే స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. బుకింగ్ కౌంటర్, ప్రయాణికుల విశ్రాంతి భవనం, దివ్యాంగుల గది, మాతా శిశువుల కోసం ఏర్పాటు చేసిన గది, ప్లాట్‌ఫాం, ప్రహరీ, విద్యుత్ తదితర పనులను తనిఖీ చేశారు. బుకింగ్ కౌంటర్‌లో గోడకు పగుళ్లు ఎందుకొచ్చాయని అధికారులను ప్రశ్నించారు.

నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని, లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట హైదరాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేష్ విష్ణోయ్, సెక్రటరీ టు జీఎం శ్రీనివాస్ మల్లాడి, చీఫ్ ఇంజనీర్(కన్ స్ట్రక్షన్) కె.నాగభూషణం, చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ ఎల్.సాంబశివరావు, డివిజనల్ లైన్స్ ఇంజనీర్ అరుణ్‌కుమార్‌శర్మ, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సురేశ్‌కుమార్, జీవీ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయుల కోసం.. విద్యార్థుల రాస్తారోకో



ఖానాపూర్‌లో రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

మక్తల్ రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులను నియమించాలని కోరుతూ విద్యార్థులు ఆందోళన బాట పట్టారు. నారాయణపేట జిల్లా, మక్తల్ మండలంలోని ఖానాపూర్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో 170 మంది విద్యార్థులున్నారు. విద్యాబోధన కోసం 5 గురు ఉపాధ్యాయులు, ఒక ప్రధానోపాధ్యాయుడు ఉండాలి. కానీ ముగ్గురే ఉపాధ్యాయులే ఉండటంతో విద్యాబోధన సక్రమంగా సాగడం లేదు. దీంతో ఆ పాఠశాల విద్యార్థులు శుక్రవారం ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. ఉపాధ్యాయులను వెంటనే నియమించాలని నినాదాలు చేశారు. వారి ఆందోళన దాదాపు గంట పాటు కొనసాగడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు బాదేపల్లి వెంకటయ్య అక్కడికి చేరుకున్నారు. ఉన్నతాధికారులకు ఫోన్ చేసి సమస్యను వివరించారు. వారం పది రోజుల్లో ఉపాధ్యాయులను నియమిస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు రాస్తారోకోను విరమించారు.

ఓలా పరిశ్రమకు జరిమానా



జిల్లా వినియోగదారుల ఫోరం ముందు పానుగంటి శశిధర్, సింగోటం

మహబూబ్‌నగర్ టౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ఓలా పరిశ్రమ యాజమాన్యానికి జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ జరిమానా విధించింది. షాద్‌నగర్ పట్టణానికి చెందిన పానుగంటి శశిధర్, కొత్తూరు మండల కేంద్రానికి చెందిన తెల్లమోని సింగోటం అనే వ్యక్తులు 2024 మేనెలలో రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లోని ఓలా షోరూంలో రూ.1.20 లక్షలు ఒకరు, రూ. 97 వేలు మరొకరు చెల్లించి, ఎలక్ట్రికల్ స్కూటర్లు బుక్ చేసుకున్నారు. కానీ షోరూం చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా స్కూటర్లను డెలివరీ చేయలేదు. పైగా షోరూం మేనేజర్ వర్మ రూ. 18 లక్షలతో ఉడాయించాడు. విషయం తెలుసుకున్న వినియోగదారులిద్దరూ తమ డబ్బు తిరిగి ఇవ్వాలని షోరూం యాజమాన్యాన్ని సంప్రదించగా, వారు సక్రమంగా స్పందించలేదు. దీంతో వారిద్దరూ శంషాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయినా ఫలితం లేకపోవడంతో మహబూబ్‌నగర్ జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ మీడియేటర్ గోపాల్ నారాయణ ద్వారా కేసు నమోదు చేశారు. న్యాయాధికారి అనురాధ కేసు పూర్వాపరాలను పరిశీలించారు. శశిధర్‌కు రూ.1.20 లక్షలతో పాటు, రూ. 50 వేలు, సింగోటంకు రూ.97 వేలతో పాటు, రూ. 27 వేలు జరిమానా చెల్లించాలని ఓలా పరిశ్రమ యజమాన్యాన్ని ఆదేశించినట్లు మీడియేటర్ గోపాల్ నారాయణ తెలిపారు.

ప్రజా సమస్యలు పరిష్కరించకపోతే ప్రభుత్వంతో పోరాడుతాం

- రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

కల్వకుర్తి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీతో జత కట్టి బీఆర్ఎస్ - బీజేపీలను ఓడించామని, ప్రజా సమస్యలు పరిష్కారం కాకపోతే రోడ్డెక్కి ప్రజల తరపున ప్రభుత్వంతో పోరాడుతామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. వందేళ్ల చరిత్ర ఉన్న సీపీఐ ప్రజా ఉద్యమాలే ఊపిరిగా పని చేస్తోందని తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి పట్టణంలో శుక్రవారం సీపీఐ జిల్లా మూడవ మహాసభలు ప్రారంభం అయ్యాయి. కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి బాలనరసింహ అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. అంతకు ముందు పట్టణంలోని గచ్చుబావి నుంచి సభా ప్రాంగణం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ అసెంబ్లీలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల ఎమ్మెల్యేలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం తప్ప, ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎర్రజెండా పార్టీ నుంచి ఎన్నికైన ఏకైక ఎమ్మెల్యేను అయిన తాను రాష్ట్రంలోని అన్ని వర్గాల సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీలో గళమెత్తుతున్నానని చెప్పారు. దోపిడీదారులకు ఎర్రజెండా అంటే భయమని, ఎర్రజెండాకు ఎదురులేదని, కార్మికులకు 8 గంటల పని దినాలను సాధించి దోపిడీని అంతం చేయడంలో ఎర్రజెండా ప్రముఖ భూమిక పోషించిందన్నారు. దేశంలోని కమ్యూనిస్టులందరూ ఒక్కటైన రోజు ఎర్రకోటపై ఎర్రజెండా ఎగురుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ జాతీయ కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ మన్‌కీ బాత్ కాకుండా జన్‌కీ బాత్ చేయాలని సూచించారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక కార్పొరేట్ సంస్థల ఆస్తులు పెరిగాయని పేదలు మరింత పేదలుగా మిగిలారన్నారు. ఈజీఎస్ పథకంలో మోదీ ప్రభుత్వం కోతలు పెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. బీజేపీని ఓడించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా కళాకారుల ఆటపాటలు అందరినీ ఉర్రూతలూగించాయి. బహిరంగ సభకు నాయకులు వెంకటయ్య, ఆనంద్, ఫయాజ్, కేశవులు, నరసింహ, ఏసయ్య, విజేయుడు, సీహెచ్.శ్రీనివాసులు, చంద్రమౌళి, భరత్, శ్రీనివాసులు, పి. పరశురాములు, దారదాసు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో కార్యకర్త మృతి

సీపీఐ జిల్లా మహాసభల ర్యాలీలో అపశ్రుతి చోటు చేసుకున్నది. పెద్దకొత్తపల్లి మండలం దేవునితిర్మలాపూర్ గ్రామానికి చెందిన కే.శ్రీను(45) మహాసభలకు హాజరయ్యారు. ర్యాలీలో పాల్గొన్న అతడు హైదరాబాద్ చౌరస్తాకు చేరుకోగానే ఛాతీలో నొప్పి వస్తోందని తోటి వారికి చెప్పారు. వారు అతడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే లోపే మృతి చెందాడు. అతడికి భార్య అలివేల, ఇద్దరు కుమార్తెలు ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

తిమ్మాజిపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : అత్తింటి వారు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, తిమ్మాజీపేట మండలం గొరిట గ్రామానికి చెందిన రుక్సానాబేగంకు, మహబూబ్‌నగర్ జిల్లా ఎదిర గ్రామానికి చెందిన మహమ్మద్ ఫైసల్‌తో మూడేళ్ల క్రితం వివాహమైంది. ఆ సమయంలో పెద్దల సమక్షంలో జరిగిన ఒప్పందం మేరకు కట్నం ఇచ్చారు.

కానీ రెండున్నర సంవత్సరాలు అదనపు కట్నం తేవాలంటూ అత్తింటి వారు ఆమెను వేధిస్తున్నారు. లేదంటే పొలం రాయించుకుని రావాలని అత్త జిలేఖ, మామ మక్బుల్, ఆడపడుచులు సల్మా, సాలేహా, సనలు ఆమెను వేధించారు. దీంతో ఆమె తండ్రి రూ. 50 వేలు ఇచ్చాడు. అయినా ఆమెపై వేధింపులు ఆగలేదు. దీంతో శుక్రవారం ఆమె తిమ్మాజిపేట పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

ఇంటర్వ్యూ

యూరియా కొరత సృష్టిస్తే చర్యలు

- ఏవో గాయత్రి



మదనాపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలో డీలర్లు యూరియా కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి గాయత్రి 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందా ?

ప్రస్తుతానికి రైతులకు సింగిల్‌విండో, ఆగ్రో రైతు కేంద్రాలతో పాటు డీలర్ల వద్ద యూరియా ఉంది.

మండలంలో పట్టాదారు రైతులు ఎంత మంది?

మండలంలో 10,300 మంది రైతులు ఉన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీ ఎంత నమోదు జరిగింది?

మండలంలో ఫార్మర్ రిజిస్ట్రీ 47 శాతం మేర నమోదయ్యింది.

రైతులకు మీరిచ్చే సలహా ఏమిటీ?

ఆరుతడి పంటల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. పత్తిలో ఆకు ఎండు తెగులు లక్షణాలు కనిపిస్తున్నాయి. రైతులు సస్యరక్షణ చర్యలు కోసం వ్యవసాయ అధికారులను సంప్రదించాలి.

న్యూస్ బాక్స్

పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : 2025-26 విద్యా సంవత్సరానికి గాను హైదరాబాద్‌లోని బేగంపేట, రామాంతపూర్ పబ్లిక్ స్కూళ్లలో 1వ తరగతి (డే స్కాలర్) ప్రవేశానికి ఆసక్తి ఉన్న గిరిజన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారి ఉమాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు 2018 జూన్ 1 నుంచి 2019 మే 31 మధ్య జన్మించి ఉండాలన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణులైతే రూ.1,50,000 లోపు పట్టణవాసులు అయితే రూ.2 లక్షల లోపు ఉండాలన్నారు. దరఖాస్తు ఫారాలు ఈ నెల 8వ తేదీన సాయంత్రం 5 గంటల లోపు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో సమర్పించాలన్నారు. ఈ నెల 12న లాటరీ ద్వారా విద్యార్థులు ఎంపిక ఉంటుందన్నారు. తమ కార్యాలయంలోనే దరఖాస్తు ఫారాలు లభిస్తాయన్నారు. దరఖాస్తు ఫారాలకు నివాస ధ్రువీకరణ పత్రం, కులము, ఆదాయం, పుట్టిన తేదీ పత్రాలు జత చేయాలన్నారు.

'వాల్మీకులకు అన్యాయం జరిగితే సహించం'



అధ్యక్షుడిని సన్మానిస్తున్న నాయకులు

చిన్నంబావి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పెద్దమారూర్‌కి చెందిన రాజ్ కుమార్ వాల్మీకి సంఘం కొల్లాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా గ్రామ వాల్మీకి సంఘం నాయకులు ఆయన్ను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అధ్యక్షుడు మాట్లాడుతూ.. వాల్మీకి బోయలకు ఎలాంటి అన్యాయం జరిగినా సహించేది లేదని అన్నారు. కార్యక్రమంలో సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జీవితాన్ని సమాజానికి అంకితం చేయాలి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : అంకితభావంతో పని చేసి పలుస శంకర్ గౌడ్ వృత్తికే వన్నె తెచ్చారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఉద్యోగ విరమణ పొందిన అనంతరం జీవితాన్ని సమాజ సేవకు అంకితం చేయాలన్నారు. ప్రధానోపాధ్యాయుడిగా పదవీ విరమణ పొందిన శంకర్ గౌడ్ సన్మాన మహోత్సవ కార్యక్రమం శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై శంకర్ గౌడ్, ఆయన సతీమణి శైలజ దంపతులను సన్మానించారు.

ఆన్‌లైన్ ఇసుకకు ఎంపీడీవోను సంప్రదించాలి

గోపాల్‌పేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ లబ్ధిదారులు ఆన్‌లైన్ ఇసుక కోసం ఎంపీడీవో కార్యాలయాన్ని సంప్రదించాలని ఎంపీడీవో భవాని తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆమె 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. మండలంలో ఇందిరమ్మ లబ్ధిదారులు ఆన్‌లైన్ ఇసుక కోసం దరఖాస్తు చేసుకునే వారు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రేచింతల, వీరరాఘవపూర్, తిప్పడంపల్లి, శాఖాపూర్ గ్రామాల నుంచి బుక్ చేసుకోవచ్చన్నారు. ఇసుక దరఖాస్తు చేసు కునే వారు ఆధార్ కార్డు, మొబైల్ నెంబర్, ఇందిరమ్మ ప్రొసీడింగ్ తీసుకురావాలని అన్నారు. దరఖాస్తు చేసుకున్న మూడు నుంచి ఆరు రోజుల్లో ఆన్‌లైన్ ఇసుక వస్తుందని అ న్నారు. ఈ ఆన్‌లైన్ ఇసుక గురించి గ్రామాల్లో ఉండే ఇందిరమ్మ లబ్ధిదారులకు గ్రామ కార్యదర్శులు, అధికారులు తెలియజేయాలన్నారు.

కరపత్రాల పంపిణీ

అమరచింత , ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి దేవాలయ పునర్నిర్మాణానికి సంబంధించిన కరపత్రాలను శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. అందులో భాగంగా 7వ తేదీన ఆంజనేయ స్వామి పూజా కార్యక్రమం నిర్వహిస్తామని గ్రామంలోని ప్రతీ ఒక్కరు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. వెంకటరెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

వంట తెచ్చిన తంట

- గొడవ పడిన వంట మహిళలు
- గంట ఆలస్యం కావడంతో ఆకలితో అలమటించిన చిన్నారులు



గంట ఆలస్యంగా భోజనం వడ్డిస్తున్న అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు

వనపర్తి విద్యావిభాగం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : వంట మనుషులు ఉపాధ్యాయులు గొడవ పడి, మధ్యాహ్న భోజనాన్ని గంట ఆలస్యంగా వడ్డించడంతో చిన్నారులు ఆకలితో అలమటించిన ఘటన వనపర్తి జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం చోటుచేసుకుంది. కొన్ని సంవత్సరాల నుంచి ఈ పాఠశాలలో ముగ్గురు వంట మనుషులు మధ్యాహ్న భోజనాన్ని వండుతున్నారు. విడతల వారీగా నెలకు ఒకరు చొప్పున మధ్యాహ్న భోజనం వండుతున్నారు. కానీ ఈ నెల ఒకటి నుంచి మహిళా సంఘం సభ్యులు మధ్యాహ్నం భోజనం వండటానికి రావడంతో, పాత వంట మనుషులకు మహిళా సంఘం సభ్యులకు గొడవ జరిగింది.

కొత్త వారికి అవకాశం ఇవ్వాలని..

ప్రస్తుతం వంట మనుషులుగా పని చేస్తున్న వారు కొన్ని సంవత్సరాల నుంచి ఇక్కడ పని చేస్తున్నారు. కానీ కొన్ని సందర్భాల్లో విద్యార్థులకు సరిపడినంత భోజనం వండకపోవడం, పాఠశాల ఉపాధ్యాయులతో అమర్యాదగా ప్రవర్తించడం వంటి ఇతరత్రా కారణాలతో పాఠశాల ఉపాధ్యాయులకు వంట మనుషులకు గతంలో గొడవలు జరిగాయి. ఈ విషయం కాంప్లెక్స్ హెడ్మాస్టర్ దృష్టికి, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ దృష్టికి వెళ్లడంతో మహిళా సమాఖ్య సభ్యులతో మధ్యాహ్న భోజనం వండించాలని అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు ఒక నిర్ణయానికి వచ్చారు. ప్రస్తుతం వంట మనుషులుగా పని చేస్తున్న ముగ్గురిని తొలగించాలని అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు తీర్మానం చేసి ఎంఈఓకి పంపించగా.. ఆయన ఆమోదించారు. ఆగస్టు ఒకటి నుంచి విధుల్లో చేరమని ఎంఈఓ చెప్పడంతోనే తాము మధ్యాహ్న భోజనం వడ్డించడానికి వస్తే గతంలో పని చేసిన వారు అడ్డుపడుతున్నారని మహిళా సమాఖ్య సభ్యులు చెబుతున్నారు. వీరి మధ్య గొడవ సద్దుమనగకపోవడంతో అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు విద్యార్థులకు భోజనాన్ని వండి వడ్డించారు.

ఆకలితో విద్యార్థులు..

ఇందిరానగర్ ప్రాథమిక పాఠశాలలో 116 మంది విద్యార్థులు ఉన్నారు. శుక్రవారం 84 మంది విద్యార్థులు పాఠశాలకు హాజరయ్యారు. ప్రతీ రోజు మధ్యాహ్న భోజనాన్ని 12:10 గంటలకు వడ్డించాల్సి ఉండగా.. వంట మనుషులు గొడవ పడడంతో గంట ఆలస్యంగా భోజనాన్ని వడ్డించారు.

అదనపు కలెక్టర్ బదిలీ



అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆర్డీవో సుబ్రహ్మణ్యం

వనపర్తి రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు (రెవెన్యూ) శుక్రవారం బదిలీ అయ్యారు. కొంతకాలంగా వనపర్తి జిల్లాలో అదనపు (రెవెన్యూ) కలెక్టర్ వెంకటే శ్వర్లు పనిచేశారు. ఆయనను ఫారన్ సర్వీసు కింద హైదరాబాద్ ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కి డిప్యూట్ చేశారు. ఆయన స్థానంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యంకు అ దనపు కలెక్టర్ రెవెన్యూగా ఇన్‌చార్జి ఇచ్చి నట్లు కలెక్టర్ పరిపాలన అధికారి భాను ప్రకాష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నూతన ఏపీఎంగా విష్ణుచారి

రేవల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : మండలానికి నూతన ఏపీఎంగా విష్ణుచారిని నియమించారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని చింతకుంట మండలం నుంచి రేవల్లికి బదిలీపై వచ్చినట్లు తెలిపారు. రేవల్లి మండలంలో విధులు నిర్వహించిన ఏపీఎం సావిత్రమ్మను బదిలీపై గోపాల్‌పేటకు నియమించారు.

భవానీ మాతకు శాలివాహనుల బోనం



బోనాలతో ఆలయానికి ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

కొత్తకోట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణ ప్రజల ఆరాధ్యదైవంగా వెలుగొందుతున్న భవాని శంకర ఆలయంలోని భవాని మాతకు శాలిహవాన (కుమ్మరి) సంఘం ఆధ్వర్యంలో బోనాన్ని శుక్రవారం సమర్పించారు. శ్రావణమాసం పోచమ్మ బోనాలకు ముందు భవాని మాతకు బోనంతో శాలివాహనులు మొక్కులు చెల్లించడం అనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే మహిళలు బోనాలతో ర్యాలీగా ఆలయానికి చేరుకొని బోనాన్ని నైవేద్యంగా సమర్పించారు. ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసులు, శాలివాహన సంఘం నాయకులు తిరుపతయ్య, శ్రీనివాసులు, ఆంజనేయులు, రాజశేఖర్, కొండన్న, పరశురాం, శివ, గౌరయ్య, యాదయ్య, జనార్దన్, నారాయణ, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘం మండల అధ్యక్షుడి ఎన్నిక



అధ్యక్షుడికి నియామక పత్రం అందజేస్తున్న నాయకులు

చిన్నంబావి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : బీసీ సంఘం మండల అధ్యక్షుడిగా రామకృష్ణను ఆ సంఘం రాష్ట్ర జనరల్ సెక్రెటరీ నియమించి, శుక్రవారం నియామక పత్రం అందజేశారు కర్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్, బోయ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు రాజ్‌కుమార్ నాయుడు, మండల అధ్యక్షుడు ఉమేష్ నాయుడు, జ్యోతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

పెబ్బేరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి) : పెబ్బేరు మునిసిపాలిటీకి చెందిన 30మంది బీఆర్ఎస్ నాయకులు జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో శుక్రవారం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మోతే రాములు, రామన్ గౌడ్, అక్కి సుశీల, అక్కమ్మ ఉన్నారు.

కృష్ణమూర్తికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

అమరచింత, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నిర్మాత కాశం కృష్ణమూర్తి 19వ వర్ధంతిని శుక్రవారం అమరచింతలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ మాట్లాడుతూ.. కార్మిక సంఘాల నిర్మాతగా ఉమ్మడి రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడిగా పని చేసి రైతుల పక్షాన అనేక పోరాటాలు నిర్వహించారని ఆయన కొనియాడారు. సంఘం నాయకులు అజయ్, వెంకటేష్, రాఘవేంద్ర, శంకర్, రాజు, పెంటన్న, నూరి, వెంకటేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండ

గోపాల్‌పేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) రాష్ట్రంలో బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి మండల కాంగ్రెస్ నాయకులకు బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేశారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీ చెందిన చిన్నయ్య అనారోగ్యం కారణంగా హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మండల నాయకుడు కొంకి రమేష్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా.. రూ.2.50 లక్షల ఎల్‌వోసీని బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మడి మండల ఇన్‌చార్జి సత్యశీలారెడ్డి, టౌన్ అధ్యక్షుడు శివన్న, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశించిన ధరలకే ఎరువులు విక్రయించాలి

ఆత్మకూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన ధరలకే ఎరువులను రైతులకు విక్రయించాలని ఆత్మకూరు మండల వ్యవసాయ అధికారి వినయ్ కుమార్ పేర్కొన్నారు. రైతుల వద్ద నుంచి అధిక ధరలు వసూలు చేస్తున్నారని ఆరోపణ మేరకు ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని ఎరువుల దుకాణాలు మహేశ్వరీ ట్రేడర్స్, బషీర్ ఏజెన్సీస్ ఆగ్రో రైతు సేవా కేంద్రం సంకల్ప రిటైల్ స్టోర్స్, జువారి పామ్ హట్ లిమిటెడ్ వంటి ఎరువుల దుకాణాల్లో శుక్రవారం టాస్క్‌ఫోర్స్ బృందంతో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ బాలేశ్వర్‌రెడ్డి, ఆయా దుకాణాల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి





పెబ్బేరులో విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు, వీపనగండ్ల విద్యార్థినితో ఉపాధ్యాయులు

పెబ్బేరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు విద్యా రంగంతో పాటు క్రీడా రంగంలో రాణించాలని మత్స్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ దుర్గం సకారాం అన్నారు. రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను శుక్రవారం మత్స్య కళాశాలలో శాలువాలతో సత్కరించి అభినందించి మాట్లాడారు. 3, 4న హనుమకొండలోని జేఎన్ స్టేడియంలో జరిగే తెలంగాణ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు టీ.గణేష్, హరిజన్ శిరీషలు ఎంపికైనట్లు తెలిపారు. సీనియర్స్ విభాగంలో జిల్లా అథ్లెటిక్స్ లాంగ్ జంప్ క్రీడలో ప్రతిభ కనబర్చి మొదటి స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో పాల్గొననున్నట్లు తెలిపారు.

వీపనగండ్ల : మండల పరిధిలోని కల్వరాల ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని మీనాక్షి రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచి ఈ నెల 3, 4 తేదీల్లో హనుమకొండలో కొనసాగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొననున్నట్లు చెప్పారు.

ఆలయాల్లో శ్రావణమాసం పూజలు



కొత్తకోటలోని భవానీ ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

కొత్తకోట, ఆగస్టు 1, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా దేవాలయాలు భక్తులతో కళకళలాడాయి. పట్టణంలోని భవాని శంకర, కోదండ రామస్వామి, భక్తమార్కండేయస్వామి, కన్యకాప రమేశ్వరి వాసవీ మాత, కానాయపల్లి, పామాపురం గ్రామాల్లోని కోటిలింగేశ్వర స్వామి, రామే శ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజ లు నిర్వహించారు. భవాని శంకర ఆలయంలో మహిళలు కుంకుమార్చన పూజలు భక్తిశ్రద్ధలతో కొనసాగించారు.

వనపర్తిలో...

వనపర్తి రాజీవ్‌చౌరస్తా : జిల్లా కేంద్రంలోని ఆలయాల్లో శ్రావణ శుక్రవారం పూజలను మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని రామాలయం, న్యూ గంజి లక్ష్మి గణపతి ఆలయం, వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయాల్లో మహిళలు అధిక సంఖ్యలో హాజరై అమ్మ వారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చన నిర్వహించారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆయా ఆలయాల్లో నిర్వాహకులు భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేశారు.



వనపర్తిలోని రామాలయంలో అమ్మ వారికి హారతి ఇస్తున్న పూజారి



వనపర్తి రామాలయంలో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

రైతులకు అందుబాటులో ఎరువులు



గోదాంలో నిల్వ ఉన్న ఎరువులను పరిశీలిస్తున్న కలెక్టర్

పెబ్బేరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాల్లో ఎరువులు తగినంత మేరకు నిల్వలున్నాయని, రైతులెవ్వరూ ఆందోళన చెందొద్దని కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. శుక్రవారం మునిసిపాలిటీలోని జై కిసాన్ జంక్షన్ ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేసి దుకాణాల బయట బోర్డుపై రాసిపెట్టిన ఎరువుల వివరాలు, గోదాంలో నిల్వలను పరిశీలించి యూరియా నిల్వలు, డీఏపీ నిల్వలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తంగా ఉన్న నిల్వలను సరిపోల్చి చూశారు. ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రైతులకు అవసరమైన మేరకు ఎరువులు ఇవ్వాలని, అవసరానికి మించి ఇచ్చి కృత్రిమ కొరత సృష్టించవద్దని సూచించారు. ఎప్పటికప్పుడు ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తూ.. దుకాణాల బయట నిలువ, ధరల సూచిక బోర్డు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రసూతి సేవలు భేష్

ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసూతి సేవలు భేష్‌గా ఉన్నాయని, గర్భిణులకు మరింత అవగాహన కల్పించి, ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు జరిగేలా కృషి చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. శుక్రవారం మునిసిపాలిటీలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించి మాట్లాడారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించి రోగులకు మెరుగైన వైద్య అందించాలని సూచించారు. అనంతరం వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ సాయినాథ్ రెడ్డి, డాక్టర్ పరిమళ, ప్రవళిక, రాజశేఖర్ ఉన్నారు.

సింగిల్‌విండో గోదాం తనిఖీ

శ్రీరంగాపురం : మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం గోదాంను శుక్రవారం కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి హైమావతి, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతీ ఒక్కరికి తెల్లరేషన్‌కార్డు

శ్రీరంగాపురం : మండల కేంద్రంలో శుక్రవారం లబ్ధిదారులకు తెల్లరేషన్‌కార్డులను ఎమ్మెల్యే మేఘారెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. నిరుపేద ప్రజల సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు ఇస్తుందని, పార్టీలకు అతీతంగా నియోజకవర్గంలో రూ.3,500 ఇళ్లు మంజూరు చేసి ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు అందజేస్తుందన్నారు. జిల్లాలో 32,942 మందికి కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేసినట్లు చెప్పారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.వెంకటేశ్వర్లు, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, కాశీ విశ్వనాథ్, రాజు, విజయవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

శుభ్రత పాటిస్తే సీజనల్ వ్యాధులు దూరం



వార్డు ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మునిసిపల్ కమిషనర్

ఆత్మకూరు , ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : పరిసరాల శుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత కూడా పాటిస్తేనే సీజనల్ వ్యాధులు దరిచేరవని ఆత్మకూరు మునిసిపల్ కమిషనర్ శశిధర్ పేర్కొన్నారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని 7వ వార్డులో శుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వర్షాకాలం కావడంతో వర్షపు నీరు ఇంటి పరిసరాల చుట్టు చేరి దోమలు, ఈగలు వ్యాప్తి చెంది సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు సంభవించే అవకాశం ఉందని, ఇంటి పరిసరాల చుట్టూ వర్షపు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకంతో క్యాన్సర్ వ్యాధులు, శ్వాస కోసం వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ సిబ్బంది భూపాల్, అశోక్, పావని, పారిశుధ్య కార్మికులు, ఆర్పీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రజా సమస్యలు గుర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రశాంత్

కొత్తకోట ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ప్రజా సమస్యలు గుర్తించి అధికారుల దృష్టికి తీసుకురావాలని కాంగ్రెస్ నాయకులకు మార్కెట్ చైర్మన్ ప్రశాంత్ సూచించారు. శుక్రవారం విలియంకొండ, మిరాసిపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశాలు పార్టీ మండల అధ్యక్షుడు బీచుపల్లి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ పదేళ్లుగా రేషన్ కార్డులు, ఇళ్ల మంజూరు లేక ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. రేషన్ కార్డుతో ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం పొందే అవకాశం చాలా మంది కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ కోసం పనిచేసే వారికి తగిన గుర్తింపు ఇవ్వడానికి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారని వివరించారు. చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, బోయోజ్, శ్రీనివాసులు, శేఖర్‌రెడ్డి, వెంకటరమణ, గోకరయ్య, సురేందర్‌రెడ్డి, సాయిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శివరాజ్, శివరాములు, సుభాష్, శ్రీశైలం నాయుడుపాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



పాఠశాలను పరిశీలిస్తున్న బీజేపీ, ఏబీవీపీ నాయకులు

అమరచింత, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వసతిగృహాల్లో చదువుతున్న పేద విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని బీజేపీ అధ్యక్షురాలు మంగ లావణ్య పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను ఏబీవీపీ నాయకులతో కలిసి అక్కడి వసతులపై పరిశీలించి మాట్లాడారు. నాణ్యమైన భోజనం అందక కొంతకాలం క్రితం ఇక్కడి విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయిందని ఆమె గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం కల్పిస్తున్న కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు అన్ని విధాల సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రాజేష్, ఉదయ్ గౌడ్, బీజేపీ నాయకులు నరసింహ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తత అవసరం



కొత్తకోటలో మాట్లాడుతున్న కమిషనర్ సైదయ్య

ఖిల్లాఘణపురం , ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని కాలనీల్లో ఇళ్ల పరిసరాలను శుక్రవారం ఫ్రైడే డ్రై డే లో భాగంగా మండల వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ పరిశీలించి వానకాలం సంభవించే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశాల మేరకు డెంగీ వ్యాధి వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలను గ్రామస్థులకు వివరించారు. నీటి తొట్టి, పాత డబ్బాలో, వాహన పాత టైర్లలో, నిల్వ నీటిలో దోమలు వృద్ధి చెందుతాయని, నిల్వ నీటిని పారబోయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాథమిక వైద్య కేంద్రం సిబ్బంది నరసింహులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

● సోలీపూర్‌లో

సోలీపూర్ గ్రామంలో శుక్రవారం మండల పంచాయతీ అధికారి రాజు ఆధ్వర్యంలో డ్రై డే ఫ్రై డేను నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టణ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

కొత్తకోట : పట్టణ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మునిసిపల్ కమిషనర్ సైదయ్య అన్నారు. శుక్రవారం పట్టణంలోని వార్డుల్లో ఫ్రై డే డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. మునిసిపల్ వార్డు అధికారులు, ఆశా కార్యకర్తలు పాలొన్నారు.

తల్లి పాలతోనే ఆరోగ్యం

వీపనగండ్ల : పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తప్పక పట్టించాలని, అవి తాగిన బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని డాక్టర్ వంశీకృష్ణ తెలిపారు. మండల పరిధిలోని గోవర్ధనగిరి గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు డ్రై డే కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. నీళ్ల నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పెబ్బేరు : ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ ప్రత్యేక అధికారి మీరాజ్ అహ్మద్ తెలిపారు. వందరోజుల కార్యాచరణలో భాగంగా శుక్రవారం డ్రై డే, ఫ్రై డే కార్యక్రమం నిర్వహించి ప్రజలకు వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మేనేజర్ గణేష్ బాబు, వార్డు అధికారులు, మున్సిపల్, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.